# చదువు

ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టి ఆర్ట్స్ కాలేజీ ఎత్తైన ముఖద్వార శిఖరం చూస్తూంటే ఏదో గర్వం - తనా విశ్వవిద్యాలయంలో అడుగు పెడుతున్నందుకే ఏదో గొప్పతనం ఊర్మిళను ఆవహించాయి. నెమ్మదిగా పరిశీలించు కుంటూ అడుగు ముందు కేసింది.

అక్కడ రకరకాల బ్యానర్లు కట్టి వున్నాయి. అవన్నీ ఏవేవో నినాదాలు, హెచ్చ రికలు, విజ్ఞాపనలు --

కొన్ని బోర్డుల మీద రాసి పెట్టారు. కొన్ని బానర్ల మీద రాసి రెండు వైపులా లాగి కట్టారు. అవి గాలికి రెపరెపలాడుతూ చూసే వారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

'నూతన విద్యార్థులకు విప్లవ స్వాగతం'--

విప్లవ స్వాగతం ఏమిటో ఊర్మిళకు అర్థం కాలేదు.

'అందాల పోటీలను బహిష్కరించండి' రిసెర్చ్ విద్యార్థినులను వేధించే ప్రొఫెసర్లను వెంటనే శిక్షించాలి'

ఒకటి ఎ.బి.వి.పి. అయితే ఒకటి పి.డి.స్.వి. మరొకటి ఎస్. ఎఫ్. ఐ. అయితే ఇంకొకటి ఐ.సి.ఎఫ్. ఎ ఎస్.పి. విద్యార్థి సంఘాల ఆక్షేపణలు, అర్థింపులు, బెదిరింపులు, ఆహ్వానాలు, తిరస్కారాలు.

అడుగులో అడుగేసుకుంటూ ఒక్కొక్క మెట్టూ ఎక్కుతుంటే విద్యాసోపానాలు ఎక్కుతున్నట్లు ఒక విచిత్రమైన భావం ఉర్మిళలో కలిగింది.

లోపల అడుగు పెట్టగానే నాలుగు వేపులా క్యారిడార్ల మధ్య విశాలమైన చతురస్రాకార వేదిక. నిశ్చలమైన కొలను మధ్య అప్పుడే విరిసినట్లు అందమైన కమలం.

ఊర్మిళకి తాళయుక్తంగా ఒక గెంతువేసి ఆ పద్మం మీద చిన్ననాటి తన నాట్య ప్రతిభను ప్రదర్శించాలని తీవ్రమైన కోరిక కలిగింది. నవాబుగారి సంస్కృతిలో దర్బారులో ఎందరో అందగత్తెలైన నాట్యగత్తెలు అద్భుత నృత్య ప్రదర్శనలిస్తున్నట్లు భావం కలిగింది ఊర్మిళలో.

కథా నిలయం
3565
శ్రీకాకుళం



కళ్ళెత్తి పైకి చూసింది. మండువాల మీంచి పైకి లేచిన ఆమె చూపులకి అద్దాల మీద పరావర్తనం చెందిన సూర్యకాంతి చురుక్కున సోకింది.

ఆమె కుడివైపు మళ్ళి నెమ్మదిగా కదిలింది. ప్రిన్సిపాల్ అన్న బోర్డున్న గదిని చూసి, చకచకా అడుగుల వేగం పెంచి, మొదటి ఫ్లోర్‌కి వెళ్ళే మెట్ల దగ్గర ఆగింది. తడి బట్ట వేసి నేలని తుడుస్తూ వచ్చినతన్ని చూసి

''ఎం. ఎ. క్లాసులెక్కడ జరుగుతున్నాయి ?''

''నూట ముప్ఫైమూడు -- పైన'' అన్నాడు.

★ ★ ★ ★

అది ఉస్మానియా యూనివర్శిటీవారు ప్రవేశ పెట్టిన డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ నిర్వహిస్తున్న కాంటాక్ట్ క్లాసు.

క్లాసు నిండుగా వుంది. గలగల్లాడుతోంది. చదువు అలవాటు తప్పిపోయి, వయస్సు మళ్ళిన వారంతా అప్పుడే స్వేచ్ఛ పొందినట్లుగా ముఖాల్లో వెలుగుతో కల కల్లాడిపోతున్నారు.

హైస్కూళ్ళల్లో అప్పర్ ప్రైమరీ స్కూళ్ళలో తెలుగు పండితులుగా పనిచేస్తూ ఎం. ఎ. చేస్తే ఏదైనా లాభముంటుందని వచ్చిన వారూ, అవకాశం దొరికింది కనుక ఎం. ఎ. అనిపించుకుందామనుకునే ఉత్సాహవంతులు, పెళ్ళిళ్ళ వల్ల చదువు అర్ధాంత రంగా ఆగిపోయి, సంసారం చేసేసి, పిల్లల్ని కనేసి వాళ్ళు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగి పోయాక, చండశాసనుల్లాంటి భర్తలు చేవతగ్గి, మెత్తబడ్డాక, భార్యలకి విద్య మీదున్న ఆసక్తిని ఆదర్శంగా ఆదరించగా బయటకొచ్చిన గృహిణులు - ఇలా రకరకాలు వున్నా రందుల్లో. వెదికి చూస్తే నలభైకి తగ్గిన వాళ్ళు వేళ్ళ మీద లెక్కపెట్టేంత వున్నారు.

ఊర్మిళ అందర్నీ పరిశీలిస్తోంది. ఒక్కొక్కరు ఒక్కొక్క రకం. కొందరు పొట్టిగా, లావుగా, కొందరు పీలగా, కొందరు అందంగా, దర్జాగా, నిర్లిప్తంగా, నీరసంగా - ఒకరి నుదుటి మీద సన్నటి గీతలాంటి బొట్టు, మరొకరు అర్ధరూపాయంత కుంకుమ, ఒకరు పోనీటేల్ - మరొకరు సిగ, ఒకరు బన్, ఒకరు జడ, ఒకరు ముడి, ఒకరు చెందేరి కాటన్ చీర, ఒకరు మైసూర్ సిల్క్, వేరొకరు వెంకటగిరి, మరొకరు బెంగాల్ కాటన్, ఇలా ఆడవాళ్ళు రకరకాలుగా - ఎక్కువమంది చీరలే - అక్కడక్కడా చూడీ దార్లు - మగవాళ్ళని చూస్తే అలసటగా, గడ్డాలు పెంచినవారు, నీటుగా పంచెకట్టిన

వాళ్ళు, దర్జాగా సఫారీ వేసినవాళ్ళు, సాదాసీదా ప్యాంటు వాళ్ళూ, కార్యకర్తల వేషం, కవిగారి వేషం – భిన్న వేషాలు, విచిత్ర భావాలు.

ఒక్కొక్క బెంచీ మీద నలుగురూ, ఒకరితో ఒకరు గలగలా మాట్లాడేసు కుంటున్నారు. కొందరైతే పరీక్షల గురించి ఆందోళన పడిపోతున్నారు. మరికొందరు ముఖ్యమైన ప్రశ్నలు చెప్పేస్తే బాగుండునని పక్కవారితో తమ అభిప్రాయాన్ని పంచు కుంటున్నారు. అందులో చాలామందికి ఎం. ఎ డిగ్రీ మడత పెట్టి యిచ్చేస్తే బుగ్గన పెట్టేసుకుందామని ఉంది.

★ ★ ★ ★

వచ్చిన ప్రొఫెసర్ తన గురించి పరిచయం చేసుకుని అందర్నీ పలకరించి పాఠం మొదలు పెట్టారు.

''సంవత్సరం పాటు మేము, మా స్టూడెంట్స్‌కి చెప్పేది మీకు ఇరవై రోజుల్లో చెప్పగలమని కాదు, అయినా మీకు సహాయంగా ఉండేకొంత మెటీరియల్, గైడ్‌లైన్స్ ఇవ్వగలము'' ఆయన మాట పూర్తికాక మునుపే...

''సార్ ! మాకు ముఖ్యమైన ప్రశ్నలు, నోట్సు, చెప్పేస్తే మేం రాసేసుకుంటాం'' అంటూ లేచాడొక ఉత్సాహవంతుడు. అది మొదటి క్లాసు. మొదటి టీచర్. మొట్ట మొదటి పాఠం మొదటి పేజీలో ఉండగానే 'ముఖ్యమైనవి' అనగానే ఆయన తెల్లబోయి, వెంటనే తేరుకొని ''అలాగే – కానీ మీరు ముందుకొంత పాఠం వినాలి. అర్థం చేసు కోవాలి'' అన్నారు.

''అర్థం చేసుకుని పూర్తిగా చదవడానికి మాకు టైమెక్కడుంది సార్'' అన్నాడు.

ఆ ప్రొఫెసర్‌గారికి వొళ్ళు మండిందో లేదో తెలీదు గానీ బయటపడకుండా

''టైము లేదంటే ఎలా ? కష్టపడాలి. మాస్టర్ డిగ్రీ కావాలనుకున్నప్పుడు టైము చేసుకోవాలి. అన్నీ క్షుణ్ణంగా తెలియాలి'' అన్నారు మెత్తగా చురకవేస్తూ.

ఇంకా ఏదో వాదన మొదలెట్టబోయినాయన్ని ఒకరిద్దరు ఆపారు. ''అసలు పాఠం సాగనివ్వండి సార్'' అన్నారు ఉత్సాహవంతుడ్ని ఉద్దేశించి.

అతను ఊరుకోక ''మనకి కావలసింది మనం చెప్పాలి కదా'' అన్నాడు అతి తెలివిగా.

"మనకేం చెప్పాలో ఆయనకి తెలుసు మీరు కూర్చోండి" అంటూ కూర్చో బెట్టారు. కాస్సేపు వాద ప్రతివాదాల తర్వాత మళ్ళీ పాఠంలో పడ్డారు. ప్రతీదానికీ లేచి అడ్డుపడే ఆ ఉత్సాహవంతుడికి సైంధవుడని నామకరణం చేశారంతా కలసి.

ఊర్మిళకి ఉత్సాహంగానూ, కొత్తగానూ ఉంది. కొందరితో మంచి స్నేహమే కుదిరింది. అందరికీ ఏదో చదువుకోవాలనే తాపత్రయం ఉన్నా ఎలా మొదలు పెట్టాలో గందరగోళంగా ఉంది.

ఒకరోజు సైంధవుడొచ్చి ఒక ప్రతిపాదన చేశాడు.

"మనందరం ఒక కమిటీగా ఏర్పడి ఒక కన్వీనర్‌ని ఎన్నుకుందాము. డైరక్టర్ గార్ని కలిసి మన సమస్యలు చెప్పుకుందాం" అన్నాడు.

"మనకి సమస్యలేంటీ ?" అని ఒకరు.

"మనం ఏదో చదువుకుందామని వచ్చాం గానీ. ఈ గొడవలెందుకూ !" అన్నారింకొందరు.

"మెమొరాండాలు, అదీ మనకెందుకూ, మనమేమన్నా రెగ్యులర్ స్టూడెంట్స్‌మా ఏం ?" అంటూ మరొకరు కొట్టేశారు.

అందరిచేత కన్వీనర్‌గా ఎన్నుకోబడి నాయకత్వం వహిద్దామని ఉవ్విళ్ళూరిన సైంధవుడు మొదట్లోనే ఆగి వెనక్కి తగ్గాల్సి వచ్చింది.

క్లాసులు జరుగుతున్నాయి. అప్పుడప్పుడు ప్రొఫెసర్రావడం అరగంటో, పావు గంటో ఆలస్యమైతే ఆ సమయంలో సైంధవుడు తన కవిత్వాన్ని గట్టి కంఠంతో వినిపించి అందర్నీ అదరగొట్టేస్తున్నాడు. కొందరు విసుక్కున్నా, కొందరు నవ్వుతూ ఎంజాయ్ చేసి వదిలేసేవారు.

ఎవరూ పాఠం మొదలు పెట్టినా సైంధవుడు అడ్డుపడకుండా ఉండడు. అతన్ని సమర్థించి వంతపాడేవారున్నా వాళ్ల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల వాళ్ళ మాట సాగేది కాదు.

వచ్చిన ప్రతి ప్రొఫెసరూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తూ, సలహాలిస్తూ పాఠాలు చెప్పారు. పరీక్షలకి కావలసిన మెటీరియల్ ఇచ్చారు. కోర్సులో ఉన్న పుస్తకాలేమైనా వాళ్ళ దగ్గరుంటే ఇచ్చేందుకు ఒప్పుకున్నారు.

అలాంటి వ్యాసాల సంపుటి తీసుకొచ్చి కావలసినవాళ్ళు కొనుక్కునేట్టు ఏర్పాటు చేశారు.

ఈరోజు ఒక పార్టీ చేసుకోవాలని అందరూ తీర్మానించారు. మళ్ళీ పరీక్షలకి కలిసినా ఈ విధంగా ఉండదు కనుక అందరం ఫోటో తీయించుకుని పార్టీ చేసుకుందామని అందరూ ఉత్సాహపడ్డారు. హడావిడి మొదలైంది.

ప్రొఫెసర్ గారిచ్చిన ఇరవై పుస్తకాలు ఊర్మిళ తీసుకుంది. అందరికీ చెప్పింది కావలిస్తే తీసుకోమని. అందరూ అటూ, ఇటూ తిప్పి చూశారు. కొందరు కావాలని తీసుకున్నారు. కొందరు వద్దన్నారు. కొందరు కాస్సేపు తీసుకుని మళ్ళీ ఇచ్చేశారు. కొందరు వద్దు వద్దని మళ్ళీ అడిగి తీసుకున్నారు. మొత్తానికి పుస్తకాలన్నీ అయిపోయాక డబ్బు లెక్కచూసి ఊర్మిళ అవాక్కయిపోయింది. ఇరవై పుస్తకాలు వెళ్ళిపోయాయి. పందొమ్మిది పుస్తకాలకే డబ్బులొచ్చాయి. అందరూ పెద్ద మనుషులే. అందరూ డబ్బు లిచ్చేమన్న వాళ్ళే. కానీ ఒక్క పుస్తకం మిస్సు... దాని తాలూకూ రూపాయిలు లెస్సు.

పార్టీ, పాటలు, సరదా కబుర్లు అన్నీ జరిగాయి గానీ ఊర్మిళ మనసు వికలమై పోయింది. ఆయన దగ్గర నుండి తనే యిరవై పుస్తకాలు తీసుకుంది. ఎవరికేం చెప్ప గలదు? చెప్పినా ఏం బాగుంటుంది? అయినా ఊరుకోలేక మరీ స్నేహంగా ఉన్న వాళ్ళతో చెప్పింది.

మర్నాడు అందరూ అదే విషయం గుసగుసలాడుకున్నారు. ఒక్కసారిగా ఉత్సాహపు పొంగుమీద నిస్పృహ నీళ్ళు చల్లినట్లుగా క్లాసు డల్‌గా అయిపోయింది. అందరి మనస్సులోనూ ఒకటే ఆలోచన ఎవరు ? ఎవరు ? ఎవరు ?

ఆ రోజుకి ఇంకా మూడు రోజులు మాత్రమే క్లాసులు ఉన్నాయి. దేవిశ్రీ పుస్తకాల్లో పెట్టుకున్న పర్సులోంచి అయిదు వందలు పోయేసరికి అందరి మనసులూ మొద్దుబారి పోయాయి. దొంగ ఎవరో తెలీదు. అంతవరకు ఎక్కడపడితే అక్కడ పుస్తకాలు పడేసి యిటూ, అటూ తిరిగేవాళ్ళంతా భుజాలమీద బరువు మోసుకుంటూ తిరగడం మొదలు పెట్టారు. డబ్బుపోయినా ఫరవాలేదు. పుస్తకాలు పోతే కష్టం కదాని..

మొదట్లో ఉన్న సరదా, ఉత్సాహం మొదలు నరికిన వృక్షాల్లా కూలిపోయాయి. విషయం తేల్చి పారేద్దామని ఎగిరిన సైంధవుడ్ని అందరూ ఆపారు. నోరెట్టుకుని పడినా అతను మంచివాడని అందరూ అనుకున్నారు.

సూర్యాపేట బస్టాండులో సూట్‌కేస్ దొంగలుండటం సహజం. రైల్వే ప్లాట్ ఫారం మీద రకరకాల దొంగలుంటారు. జేబు దొంగలు ఉంటారు. నగలు కత్తిరించే వారు ఉంటారు. కానీ యూనివర్సిటీలో అపురూపంగా నాలుగురోజులు క్లాసులు అటెండ్ కావడానికొచ్చిన వారిలో దొంగల్ని ఎవరూ ఊహించలేకపోతున్నారు.

అందరికీ ఒకరిమీద ఒకరికి అనుమానం లేకపోయినా నమ్మకం లేకుండా పోయింది. పేదరికం, ఆకలి, దొంగతనం చేయడానికి ప్రేరేపిస్తాయని అంటారు. ఇదేమి టిక్కడ ? అందరికీ ఇది చేదు అనుభవంగా నిలబడి పోయింది. మింగుడు పడకుండా ఉండిపోయింది.

ఊర్మిళ చాలా తీవ్రంగా ఆలోచిస్తోంది. 'చదువు' అంటే ఏమిటి ? అక్షరాస్యతా?? అక్షరాలు వచ్చినంత మాత్రాన చదువుకున్నట్లా ? ఇక్కడికి చదువు కోవడానికొచ్చామా? లేక చదువు కొనుక్కోడానికొచ్చామా ? సంస్కారాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది కదా చదువు. మరిప్పుడు యిక్కడ లభిస్తున్నదేమిటి ? మనం పొందుతున్నదేమిటి ? ఒక 'దొంగ' ఇంతమందిని వెర్రి వెధవల్ని చేయడం సహించ రానిదిగా ఉంది. కానీ ఏం చేయాలి ?

ఆ చివరి రోజు అందరూ ఒకరి నుండి ఒకరు వీడ్కోలు తీసుకున్నారు. ఎడ్రెస్లు రాసుకున్నారు. ఫోను నెంబర్లు నోట్ చేసుకున్నారు.

ఎత్తైన ఆర్ట్స్ కాలేజీ మెట్లు దిగుతుంటే ఊర్మిళకి పాతాళంలోకి దిగుతున్న విచిత్రమైన భావన కలిగింది.